# మేడిన్ ఇండియా




ఆ ఫ్యాక్టరీలో సైరన్ గొంతుచించుకొనింది !

కోడళ్ళమీద గొంతు చించుకోవడమంటే కొందరు అత్తమ్మలకు మహా సరదా!– వాయీవగలేని మొగుళ్ళమీద గొంతు చించుకోవడమంటే పెండ్లాలకు బలే ఖుషీ!!– లేనోళ్ళమీద గొంతుచించుకోవాలని ఉన్నోళ్ళకు ఉబలాటం!

గొంతు చించుకోవడానికి ఫ్యాక్టరీలో సైరన్ కయినా ఏదో ఒక నిర్ణీత సమయమం ఉంటుంది. కానీ, అత్తమ్మలకు, పెత్తందార్లయిన కొందరు పెండ్లాలకు, ఉన్నోళ్ళకు వేళాపాళా ఉండదు సందు దొరికితే చాలు. సైరన్‌తో పోటీ పడ్తారు.

అప్పుడప్పుడు వీధుల్లో కొన్ని గాడిదలు గొంతు సవరించుకొంటుంటాయి. అప్పుడు నెత్తినచెయ్యి పెట్టుకొంటాం. ఒక వీధి కుక్కలు ఇంకొక వీధి కుక్కల్ని చూస్తే గొంతు సరి చేసుకొంటుంటాయి. అప్పుడు రాయీ రప్ప చేతికి తీసుకొంటాం. అయితే ఫ్యాక్టరీలో సైరన్

గొంతు చించుకొనిందంటే- బొరుగులు చల్లితే గుంపు చేరే కాకుల్లా బిలబిలా ఆ ఫ్యాక్టరీలో కార్మికులు ప్రవేశిస్తారు.

"అది ఒక కర్మాగారం. ఆ కర్మాగారంలో రైలుపెట్టెలు తయారు చేస్తారు" అని అంటే కర్మాగారమా? చర్మ రోగమా? అని ప్రాసకోసం ప్రాకులాడే తెలుగువాడికి తేట పడుతుందో లేదో కానీ కోచ్ ఫ్యాక్టరీ అంటే మాత్రం కోచింగ్ లేకనే క్యాచ్ చేస్తాడు.

ఆ ప్రత్యేకత తెలుగువాడి సొత్తు !

ఆ కోచ్ ఫ్యాక్టరీలో ఉదయం ఎనిమిది గంటలప్పుడు సైరన్- ఈ ఎండకాలంలో నీళ్ళురాని కొళాయి వద్ద ఆడవాళ్ల రంపులా ఓ స్థాయిలో ఆరంభమై అరగంటలో నీళ్ళు నిలిచిపోతే తలలు వాల్చే తరుణీమణుల్లా ఆరోనిముషంలో నిట్టూర్చి ఏడో నిముషానికో ఎనిమిదో నిముషానికో ఆగిపోతుంది. మరు నిముషమే పని ప్రారంభమవుతుంది.

"ఎన్నా పొన్ను సామీ! అల్లా సౌఖ్యందానా?"

"ఆరె హుస్సేన్ సాబ్! తు కబ్ ఆయారే!"

"ఎన్రీ సామీ బసప్పా?.... లీవుమేలె ఓగిద్దిల్లా? ఎవాగబందిద్దు?

"ఎంద వర్తమాననాయర్?...అల్ల సుగందానే?"

"ఏఁవండీ వెంకటేశ్వర్రావ్ గారూ? బొత్తిగా నల్లపూసై పోయారేంటండి?"

రకరకాల మనుషులు. రకరకాల భాషలు. ఒక్కరి భాష ఇంకొక్కరికి అర్థం కాకపోవచ్చు. అయితే అందరికీ సైరన్ భాష మాత్రం అర్థం అవుతుంది. పని ఆరంభమవుతుంది.

వేలాది చేతులు చకచక కదులుతుంటాయి

యంత్రాలు తిరుగుతుంటాయి

లయబద్ధమైన శబ్దం ఒక్కొక్కప్పుడు చెవికి కింపుగా ఇంకొక్కప్పుడు రంపుగా కొనసాగుతూ ఉంటుంది.

రకరకాల మనుషులకు రకరకాల మనస్తత్త్వాలు అయితే ఆ అందరి తత్త్వం ఒక్కటే! రైలు పెట్టెలు తయారు చేయడం. రైలుపెట్టె నిర్మాణానికి కావలసిన ప్రతి విడిభాగం చీల నుండి చక్రం వరకు ఒక్కొక్క భాగం ఒక్కొక్కచోట తయారవుతుంది.

ఛటోపాధ్యాయ ఒక పార్ట్ చక్కగా తయారుచేస్తాడు. సింగ్ చేతుల్లో ఇంకొక్క భాగం అందంగా తయారవుతుంది. నాయర్ ఒక భాగానికి నాణ్యాలు దిద్దుతాడు. రావ్ ఇంకొక భాగానికి రంగు తెస్తాడు. పళనిసామి ఇంకొక్క పార్ట్‌ని ప్రత్యేకంగా తయారుచేస్తాడు. అలా తయారైన ఒక్కొక్క విడిభాగానికి ఒక్కొక్క నంబరు ముద్రిస్తారు. ఆ విడిభాగాలన్నీ ఒకచోట చేరుతాయి.

ఒకరు తల దువ్వుతారు. ఒకరు పూలు ముడుస్తారు. ఇంకొకరు చీర సవరిస్తారు. మరొక్కరు ఆభరణాల్ని అలంకరిస్తారు. ఆపిల్ పండులాంటి అందమైన బుగ్గమీద ఇంకొక్కరు దిష్టిచుక్క పెడతారు. అందాలబొమ్మ పెండ్లికూతురు పీటలమీదికి తయారవుతుంది.

ఈ విడిభాగాలన్నింటినీ ఎక్కడివక్కడ పొందుపరిస్తే పట్టాలమీదికి రైలు పెట్టె తయారవుతుంది అలా తయారైన రైలు పెట్టెకు పెండ్లి కూతురికి దిష్టి చుక్కలా అందమైన 'లేబిల్' బిగించడం కందసామి వంతు.

ప్రతి రైలు పెట్టెకు 'లేబిల్' బిగించి అయిదడుగులు వెనక్కు నడస్తాడు కందసామి. అక్కడ నిలబడి ఆ 'లేబిల్' ని కిందనుండి పైకి పైనుండి కిందికి, ఈ పక్కనుండి ఆ పక్కకు, ఆ పక్కనుండి ఈ పక్కకు రకరకాల కోణాల్లో చూస్తాడు. ఎలా చూసినా ఆ లేబిల్ ఎంతో అందంగా కనిపిస్తూ ఉంటుంది. అప్పుడతని పెదాలపై చిరునవ్వు విరుస్తుంది. కన్నుల్లో కాంతి కురుస్తుంది. మొగంనిండా పువ్వులు పూస్తాయి. అప్పుడు కందసామి ఆ లేబిల్‌ని తనివిదీరా చూస్తూ "మేడిన్ ఇండియా!" అని తన్మయత్వంతో చదువుతాడు.

అప్పుడతని ఎద మూరెడు ముందుకుపోతుంది.

మూరెడు ముందుకుపోయిన ఎదను మళ్ళీ వెనక్కు తెచ్చుకొని వంగి ఆ పెట్టెకు నమస్కరిస్తాడు. అక్కడికీ తృప్తి చెందక ఆ పెట్టెచుట్టూ ప్రదక్షిణం చేసి చేతులెత్తి నమస్కరిస్తాడు.

అప్పుడక్కడ శోభన్రావుంటే అదొక చోద్యంగా నవ్వుతాడు.

'జ్యోతి' అని అందమైన పేరున్న అమ్మాయి కోతి మాదిరుండవచ్చునేమో కానీ, శోభన్రావ్‌కు మాత్రం పేరుబలం కుదిరింది.

శోభన్రావ్ అక్షరభ్యాసం ఏ సుముహూర్తాన జరిగిందో కానీ, చిన్నప్పుడే అతడు వీధి గోడల్ని పలకలుగా వాడుకొన్నాడు. వాటిమీద నినాదాల్ని అందంగా రాస్తూ తిరిగాడు.

అలా తిరుగుతూ తిరుగూతూ అతడు ప్రపంచ పర్యటన చేశాడో లేదో కానీ ప్రపంచ విఖ్యాత నాయకులందరూ ఎవరెవరు ఎప్పుడెప్పుడు పుట్టారో ఎప్పుడు బొట్టు కట్టారో వాళ్ళకు బిడ్డలెప్పుడు పుట్టారో– కళ్ళు మూసుకొని మ్యాప్ పాయింటింగ్ చెప్పే విద్యార్థిలా చెప్పగలడు.

శోభన్రావ్ మార్క్సిజాన్ని మననం చేసినాడో లేదోకానీ మాటకొకసారి మార్క్స్ మహాశయుని తలవకుండా మాట్లాడలేడు.

ఏనాటికో ఒకనాటికి వర్గ పోరాటం ఫలిస్తుందని... ఈ దోపిడీ విధానం నశిస్తుందని... శ్రామికజన సార్వభౌమత్వం సిద్ధస్తుందని శోభన్రావ్ గట్టిగా నమ్ముతున్నాడు. నమ్మిస్తున్నాడు. అందుకే అతడు ఆ కార్మిక వర్గానికి నాయకుడయ్యాడు.

కందసామి రైలుపెట్టెకు కైమోడుస్తుంటే శోభన్రావ్ పకపక నవ్వుతాడు.

కనబడేది పదార్థం. ప్రత్యక్షంగా కనపడనిది శక్తి. ఇవి రెండూ ఒకటేనని నేటి శాస్త్రం చెబుతుంది. అయితే పదార్థానికి మూలం అణువు. అణువుకు మూలం పరమాణువు. ఆ పరమాణువు సృష్టికి కారణం పరమాత్ముడు. అందుకే కందసామి పదార్థంలో పరమాత్ముని దర్శిస్తాడు.

యూరియా నీరు మరికొన్ని మలిన పదార్థాలు రక్తంలో నుండి బయటపడి 'చెమట' అనిపించుకొంటే ఆ చెమట బిందువులే శ్రమ శక్తిగా భావించి శోభన్నావ్ చెమటను గౌరవిస్తాడు.

శాస్త్రానికి ఇద్దరూ దూరమే! అయితే వ్యక్తులుగా చాలా దగ్గరివాళ్ళు. ఆ రోజు కందసామి రైలుపెట్టె ముందు నిలబడి ఉన్నాడు. అతని చేతిలో 'మేడిన్ ఇండియా' లేబిల్ ఉంది. ఎంతో ఉత్సాహంగా ఆ పెట్టెకు లేబిల్ తగిలించవలసిన కందసామి అడుగు ముందుకు వేయలేకపోతున్నాడు. ఆ పెట్టెవైపు, లేబిల్ వైపు మార్చిమార్చి చూస్తున్నాడు. అలా చూస్తూ చూస్తూ ఉండగానే అతని గుండె బరువెక్కింది. కండ్లు నిండుకున్నాయి. ఆ 'లేబిల్' మీద మేడిన్ ఇండియా అక్షరాలు మసకమసగ్గా కనుపిస్తూ కనుపిస్తూ కడకు కనిపించకుండా పోయాయి. ఆ లేబిల్ ఒక సినిమా తెర మాదిరిగా మారింది. ఆ తెరమీద వారం రోజుల క్రితం జరిగిన సంఘటన సినిమాలా కనిపిస్తూ ఉంది.

ప్రతి రోజులాగే ఆరోజు కూడ మధ్యాహ్నం పన్నెండు గంటలకొకసారి సైరన్ మోగింది. తుపాకి శబ్దంతో బిలబిల లేచి ఇంకొక్క చోట చేరే కాకుల్లా కార్మికులు చేతుల్లో పనులు ఆపారు. కేరియర్స్‌ను చేతికందుకున్నారు. భోజనం చేయడానికొకచోట చేరారు. ఉడ్డలుడ్డలుగా కూర్చున్నారు. ముద్దముద్దకొకమాట ముద్దుముద్దుగా మాట్లాడుతూ తింటున్నారు.

గాంధీ చిత్రంతో ఆరంభమయింది సంభాషణ. ఒక ఆంగ్లేయుడు భారతీయ నాయకునిమీద చిత్రించడం అపురూపమని ఒకరంటే, కలెక్షన్స్ గురించి ఇంకొకరు మాట్లాడుతున్నారు. ఒకరు యూనియన్ గొడవల్ని తడిమితే ఇంకొక్కడు తెలుగుగంగ మదరాసు రాష్ట్రానికి తరలడం రాష్ట్ర సమైక్యతా దృక్పథానికి ప్రతీక అంటున్నాడు. అంతలో అనుకోనట్లుగా సంభాషణ రాజకీయాలవైపు మొగ్గింది.

"యార్ దా ఎన్నాదా సెప్పినా తెలుగు ఆళుక్కుదా మూళ రొంబికమ్మి... ఒకరుదా ఎట్లాదా పోతే అల్లారుం అట్లాదా పోదురు. అంద విషయంలోదా రొంబామట్టం!" – నవ్వుతూ అన్నాడు ముత్తుసామి.

"అచ్ఛాగా సెప్పినావ్‌భయ్యా!– వాళ్‌కిశిర్మెకాదు– బుద్ధి– మోకాళ్మెహుండాది!" అందుకొన్నాడు హుస్సేన్ సాబ్.

ఇలా తమాషాగా ఆరంభమైన సంభాషణ చినికి చినికి గాలివానగా మారింది. నువ్వెంత? అంటే నువ్వెంత? అని మాటకు మాట పెరిగింది. ఆంధ్రుడు ఆవేశపరుడు కదా? మాటలు మాని చేతల్లోకి దిగాడు. ముత్తుసామి దవడ మత్తు వదిలింది. ఆ దెబ్బతో తమిళులు మలయాళీలు మహమ్మదీయులు ఒకటయ్యారు. కన్నడిగులు తెలుగువాళ్లకు అండగా నిలిచారు. ఆ ఫ్యాక్టరీలో చేతికి ఏది దొరికితే దాన్ని ఒకరిమీద ఒకరు విసురుకొన్నారు. అపూట రామరావణ యుద్ధమే జరిగింది. ఒకరిద్దరు ప్రాణాలు కోల్పోయారు. కొంతమందికి తీవ్రమైన గాయాలు తగిలాయి.

ఫ్యాక్టరీ మూతపడింది.

తమిళులు, మలయాళీలు కలిసి 'గో బ్యాక్ ఆంధ్రాస్... గో బ్యాక్ కన్నడిగాస్!" అన్న నినాదాన్ని లేవదీశారు.

ఈ వార్త రాజమాణిక్యం చెవుల్లో రాజుకొనింది.

రాజమాణిక్యం- రాజకీయాల్లో అసలు సిసలైన మాణిక్యం. మొన్న మొన్ననే జరిగిన యం.యల్.ఎ. ఎన్నికల్లో ఎంత పట్టుబట్టి పోరాడినా డిపాజిట్టు కూడా రాకుండా పోయేసరికి తీరిగ్గా ఇంట్లో కూర్చుని గోళ్లు గిల్లుకుంటున్నాడు. గిల్లి గిల్లి గిల్లడానికి గోళ్లు కూడా మిగలకుండా పోయ్యేటప్పటి ఇంకెవర్ని గిల్లాలని ఆలోచిస్తున్న సమయంలో కోచ్ ఫ్యాక్టరీ వార్త ఎదుట నిలబడి 'హాచ్' మని రెండు తుమ్ములు తుమ్మింది. రాజమాణిక్యం ఎగిరిపడి లేచాడు. గోళ్లు గిల్లినంత గోముగా విద్యార్థుల్ని గిల్లాడు.

గిల్లిపెడ్తే ఉలిక్కిపడే వయస్సు విద్యార్థులు 'పోలో' మని అరుస్తూ కదిలారు. ఊరేగింపులు లేవదీశారు. 'గో బ్యాక్ ఆంధ్రాస్!... జాబ్స్ ఓన్లీ ఫర్ లోకల్స్' అని నినదించారు. కంటబడిన బస్సుల్ని, రైలు పెట్టెల్ని తగలపెట్టారు!...

పరిస్థితి యధాస్థితికి రావడానికి వారంరోజులు పట్టింది.

వారంరోజుల తర్వాత మళ్ళీసైరన్ ఉదయం ఎనిమిదిగంటలప్పుడు యథావిధంగా గొంతు చించుకొనింది. వేలాది చేతులు కదులుతున్నాయి. యంత్రాలు తిరుగుతున్నాయి. కోచ్ ఫ్యాక్టరీలో పని ప్రారంభమయింది.

ఎవరి పనులు వాళ్ళు చేస్తుంటే ఏ భాగానికా భాగం విడివిడిగా తయారవుతూఉంది. ఆ భాగాలన్నింటినీ ఎక్కడివక్కడ పొందుపరిస్తే సింగారించిన పెళ్ళికూతురిలా రైలు పెట్టె తయారవుతూ ఉంది.

అయితే కందస్వామి మాత్రం కదిలీమెదలకుండా రైలు పెట్టె ముందు నిలబడి ఉన్నాడు. అతని చేతిలో 'మేడిన్ ఇండియా' లేబిల్ ఉంది. అతని గుండె బరువుగా ఉంది. కండ్లు నిండుకొన్నాయి. లేబిల్ తగిలిస్తే... ఆ పెట్టె బయటికి వెళ్ళితే దానిగతి అంతేనేమో? అని మనసు రోదిస్తూ ఉంది.

"ఎన్నాప్పా? కందసామీ!- అట్లాదా నిలబడూడిస్తివే!"

శోభన్రావ్ పిలుపుతో ఈ లోకంలో పడ్డాడు కందసామి.

"ఊc! ఊc!...లేబిల్ మాటప్పా!... అప్పరందా వంగిదా మొక్కు ప్రదక్షిణం మాటదా మర్చిపూడ్సేవు..." ఎగతాళి పడ్తున్నాడు. శోభన్రావ్.

"రావ్‌జీ! అయితే ఇంకెవరికి మొక్కమంటావ్?"

కందసామి తమిళుడైనా చక్కని తెలుగు మాట్లాడుతాడు.

ఇంతకాలం ఎంతగా ఎగతాళిచేసినా బదులుపలకని కందసామి ఎదురుప్రశ్న వేసేసరికి శోభన్రావ్ చోద్యంగా చూస్తూ నిలబడ్డాడు.

"చెప్పండి రావ్‌జీ!"

"ఏమనుకోవద్దు!– రాతికి, రప్పకు, చెట్టుకు పుట్టకు, రైలు పెట్టెకు మొక్కుతున్న మన మూఢాచారాల్ని చూస్తుంటే నాకు మతిపోతుంది. తమకు అర్థంకాదు. చెబితే వినరు. ఏం చెయ్యాలి?– పోనీ నువ్వే నిశితంగా ఆలోచించు. మనిషికి మించిన గొప్ప శక్తిని మనం చూడగలుగుతామేమో?– మానవతా విలువలు తెలిస్తే మనిషికే మొక్కాలి!"

"అవును రావ్‌జీ!... తమషా మాటలకే తలలు పగులగొట్టుకున్న నీ మనిషికి మొక్కాలి. ప్రాంతీయదురభిమానంతో భాషాభిమానంతో కలహాలు రెచ్చకొడుతున్న నీ మనిషికి మొక్కాలి. వారం దినాలు ఫ్యాక్టరీ మూయించిన నీ మనిషికి మొక్కాలి. ఎన్నో వేలమంది శ్రమశక్తులతో ఎంతోఅందంగా తయారైన ఈ రైలు పెట్టెకు క్షణంలో నిప్పుపెట్టే నీ మనిషి మనస్తత్వానికి మొక్కాలి. ఎందుకీ విభేదాలు? ఏ మనిషి అయినా కుడిచేత్తో తిని ఎడమచేత్తో కడుక్కొనేవాడే కదా?– ఈ మాత్రం గ్రహించ గలుగుతున్నారా? ఈ నీ మనుష్యులకంటే ఈ రైలుపెట్టె ఎంతో నయం. ఎక్కడికి పొమ్మంటే అక్కడికి పోతుంది. ఏ ఇంజనుకు తగిలిస్తే ఆ ఇంజన్ వెనుక పోతుంది. ఏయే పెట్టెలతో కలిపితే ఆయా పెట్టెలతో కలుస్తుంది. ఉన్నోళ్ళు, లేనోళ్ళు, ఉద్యోగులు కుంటోళ్ళు, గుడ్డోళ్ళు ఎవరైనా సరే!– తరతమ భేదాలు లేకుండా చోటు ఇస్తుంది. ఇది మేడిన్ ఇండియా! ఈ మేడిన్ ఇండియా తత్త్వం నీలో నాలో మనందరిలో వచ్చిననాడు– రైలు పెట్టెకే కాదు నీ మనిషికీ మొక్కుతా!"

తొణక్కుండా బెణక్కుండా స్థిరచిత్తంలో కందసామి ఇచ్చిన తీర్పు ఆశ్చర్యం– ఆనందంగా మారి శోభన్‌రావును ఊపేశాయి. ఆ ఊపులోనే "నిజమేగదా? ఆసేతు హిమాచలం నివసిస్తున్న మనుషులందరు మేడిన్ ఇండియానే కదా! ఈ జాతీయతా భావంతో అందరూ ఒకే జాతి భారత జాతి స్థాయికి ఎదిగే దెప్పుడో?" అని ఆలోచిస్తూ కందసామిని చూశాడు.

ప్రతి నిత్యం తాను చూసే కందసామి ఆరోజు తనకంటే ఎంతో ఎత్తులో ఎంతో అందంగా కనిపిస్తున్నాడు కొత్తగా తనకంటికి! ●

**ఆంధ్రపత్రిక**
(6, జనవరి 1984)